క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఉన్న అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, కొంకుదురు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు యాసలపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



తొస్సిపూడిలో పూజలు చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మశ్రీ యలమంచి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గవ్యాంత పూజ, ఉదక శాంతి, ధ్యాన్యాధివాసం, హోమాలు, యాగశాల ప్రదక్షిణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, ఉపసర్పంచ్ ద్వారంపూడి వీర వెంకట రామారెడ్డి, ఎంపీటీసీ తేతలి సుమ, మేడపాటి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పునర్నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవం, సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు దేవదాయ, ధర్మదాయశాఖ కార్యనిర్వహణాధికారి సోమాల శివ తెలిపారు. మాఘ శుద్ధ ద్వాదశి బుధవారం ఉదయం 10.32 గంటలకు హనుమత్, లక్ష్మణ, సీతా సమేత రామచంద్రమూర్తి విగ్రహాల ప్రతిష్ఠ, జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు ఆరాధ్యుల రమేష్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరవుతారన్నారు.

శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి



రంగంపేటలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

రంగంపేట: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా వైద్య విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు కోరారు. మంగళవారం స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 108 కోట్ల సత్యసాయి లిఖిత నామ మహాయజ్ఞం, జిల్లాలో రథయాత్ర, ప్రశాంతి ం యాత్ర వంటి కార్యక్రమాలు సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్నాయన్నారు. సేవా సమితి కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సామూహిక సహస్రనామార్చన, భజన నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి నేతి సత్యనారాయణ, సేవాదళ్ సభ్యులు మలిరెడ్డి మణి, చిరట్ల రంగమాంబ పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ చర్చిపై దాడికి ఖండన

మధురపూడి: ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో బైబిల్ మిషన్ చర్చిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కోరుకొండ మండలం నర్సాపురంలో మంగళవారం అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ చర్చిపై దాడి ఘటనను ఖండించారు. సమావేశంలో అధ్యక్షుడు చిర్రా ప్రసాద్, ఉపాధ్యక్షుడు నక్కా ఆనంద కుమార్, ముఖ్య సలహాదారులు వరిగేటి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మహిళ అరెస్ట్

సీతానగరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మిర్తిపాడుకు చెందిన కోరాడ వెంకటలక్ష్మిని అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఆమె నుంచి 650 ఎంఎల్ బీరు సీసాలు తొమ్మిది స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ

- ప్రతిపక్షాల గుండెల్లో గుబులు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



గాదరాడలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆదరణ పెరుగుతోందని, దాన్ని గమనిస్తున్న ప్రతిపక్ష పార్టీల గుండెల్లో గుబులు పుడుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 మంది మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వారందరికీ ఎమ్మెల్యే రాజా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పేద, మధ్యతరగతి వర్గాలకు కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించామని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్లు నిర్మించామని, గాదరాడ గ్రామాభివృద్ధికి రూ.8 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలి, ఇంటింటికీ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. టీడీపీ – జనసేన పొత్తు ప్రజలను వంచన చేయడానికే అన్ని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎప్పుడూ సింగిల్‌గా పోటీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలను ఓడించి, జగనన్నకు ఓటేసి, అభివృద్ధికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పాలెం నాగ విష్ణు, నాయకులు అరిబోలు చినబాబు, చీర్ల శివసుబ్రహ్మణ్యం, కవలపల్లి శ్రీను, కందికట్ల జయకర్, వనుం సత్తిబాబు, గొల్లవిల్లి అశోక్ పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి చేశాం



ఊలపల్లిలో కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గ్రాసిం ఇండస్ట్రీ సౌజన్యంతో కొంకుదురు, ఊలపల్లి గ్రామాల్లో నిర్మించిన కళావేదికలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఊలపల్లి గ్రామంలో రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. విపక్ష నేత చంద్రబాబు మాటలకు నిలకడ ఉండదని విమర్శించారు. రెండేళ్ల ముందు ముఖ్యమంత్రి జగన్ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడేమో ఎన్నికల్లో ఓట్ల కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ప్రజలకు ఆయనపై నమ్మకం లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి, జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీటీసీలు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, ఊలపల్లి సర్పంచ్ బందారు రమ్య, వైస్ ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, ఎంపీటీసీ బందారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, కొంకుదురు సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



వైద్య శిబిరంలో రోగులకు ఆరోగ్య కార్డులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలోని ఎంపియూపీ స్కూల్ వద్ద సర్పంచ్ కూటి సాయితాతారావు అధ్యక్షతన, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.చిన్నారావు పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో 364 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి మణికుమార్, డాక్టర్లు సాయి ప్రణీత్, జనార్దన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గుమ్ములూరు హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల, బూరుగుపూడి, గుమ్ములూరు, మధురపూడి, బుచ్చెంపేట, కోరుకొండల్లోని సుమారు 19 పోలింగ్ కేంద్రాలను మంగళవారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పరిశీలించారు. సూక్ష్మ పరిశీలన అనంతరం కేంద్రాల్లోని మౌలిక వసతుల కల్పనపై సంబంధిత హెచ్ఎంలకు సూచనలిచ్చారు. తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీ నరేష్ పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు రైతులకు ఊరట

- మిచాంగ్ తుఫాను పంట నష్టానికి పరిహారం మంజూరు
- 772 మందికి లబ్ధి
- ప్రకటన విడుదల చేసిన ఎమ్మెల్యే రాజా



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన వర్జీనియా పొగాకు రైతులకు నష్టపరిహారం మంజూరైందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఈ మేరకు టుబాకో బోర్డు నుంచి ఉత్తర్వులు వచ్చాయని మంగళవారం ప్రకటనలో వివరించారు. నియోజకవర్గంలో 698.82 హెక్టార్లలో పంటనష్టం జరిగ్గా, హెక్టార్‌కు రూ.10 వేలు చొప్పున విడుదల అయ్యిందన్నారు. తద్వారా 772 మంది రైతులకు ఊరట లభించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ రైతులను నిర్లక్ష్యం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే వ్యవసాయానికి పెద్దపీట వేసి, రైతులకు అండదండగా ఉంటోందన్నారు. రైతులు పండించే పంటలకు తప్పని సరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచించారు. తక్షణమే స్పందించి రైతులకు నష్ట పరిహారం అందించిన టుబాకో బోర్డు చైర్మన్ గరికిపాటి యస్వంత్, ఈడీ శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు

వివరాలు ఇవీ..

రాజానగరం నియోజకవర్గంలో 980 హెక్టార్లలో వర్జీనియా పొగాకు పంటను సాగు చేశారు. మిచాంగ్ తుపాను కారణంగా 698.82 హెక్టార్లు పంటకు పూర్తి స్థాయిలో నష్టం జరిగింది. ఆ సమయంలో రైతులతో కలిసి నష్టపోయిన పొగాకు పంటలను ఎమ్మెల్యే రాజా పరిశీలించారు. ఈ విషయాన్ని టుబాకో బోర్డు చైర్మన్ గరికిపాటి యశ్వంత్ దృష్టికి తీసుకువెళ్లారు. యశ్వంత్ ఆదేశాల మేరకు టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి, జరిగిన నష్టాన్ని టుబాకో బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాట ప్రకారం నష్టపరిహారం మంజూరు కావడంతో 772 మంది వర్జీనియా రైతులకు ఊరట లభించింది.

మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- బుచ్చెంపేటలో డ్వాక్రా మహిళలతో సమావేశం



జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు జరుపుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో మంగళవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు స్వయంగా అభివృద్ధిని సాధించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. డ్వాక్రా సంఘాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమెను మహిళలు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం జయంతి రాజ్, సర్పంచ్ తాడేపల్లి జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు తాడేపల్లి మేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



తొస్సిపూడిలో వలంటీర్లను సత్కరించిన నాయకులు

బిక్కవోలు: సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీటీసీ తేతలి సుమ అన్నారు. మంగళవారం తొస్సిపూడి సచివాలయం వద్ద వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవా మిత్ర పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏర్పాటుచేసి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తేతలి సూర్యచంద్రనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ విస్సాకోటి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గ్రాసిం ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- వాటర్‌ట్యాంక్, సాంస్కృతిక భవనాలకు ప్రారంభోత్సవం



బాలవరంలో వాటర్‌ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బాలవరంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 60 వేల నీటి సామర్థ్యం గల వాటర్‌ట్యాంక్, సాంస్కృతిక భవనాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎప్పటి నుంచో తీవ్ర మంచినీటి కొరతను ఎదుర్కొంటున్న బాలవరం గ్రామ ప్రజలకు వాటర్ ట్యాంక్ ఏర్పాటుతో మంచినీటి కష్టాలు గట్టెక్కాయన్నారు. అనంతరం గ్రాసిం సంస్థ ఆధ్వర్యంలో వడిశలేరు పెరికీల కాలనీలో నిర్మించిన సాంస్కృతిక భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక భజే నారాయణస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇబ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల వ్యవహారాల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకష్ణారెడ్డి, సర్పంచ్‌లు గోలి రమణ, కొల్లాటి శ్యామలావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సీతానగరం: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడానికి సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీకి చెందిన గుమ్మడి రాజు భార్య పోశమ్మకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. గత ఏడాది గుమ్మడి రాజు అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజల సమస్యలను గాలికి వదిలేశాయన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని చక్కగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మట్టా శ్రీనివాస్, వెంకటరమణ, చీర్ల పోశయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌ఓ ఎం.మాధురి

అనపర్తి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ ఎం.మాధురి అన్నారు. నియోజకవర్గ స్థాయిలో నియమితులైన సెక్టార్ అధికారులు, పోలీసు సిబ్బందితో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాధురి మాట్లాడుతూ ఎన్నికల విభాగాధికారులు, సిబ్బంది అప్రమత్తతతో ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు అందరికీ మెజిస్టీరియల్ పవర్స్ ఉంటాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించి దానికి అనుగుణంగా పోలీసుశాఖ తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం సూచించిన నియమ, నిబంధనలపై అధికారులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండి దానికి అనుగుణంగా సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. సెక్టార్ అధికారులు రూట్ ఆఫీసర్లు వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లపై, ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ పనితీరుపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా సెక్టార్, రూట్ ఆఫీసర్లు వారి పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ముందుగా బీఎల్ఓల సహకారంతో లేఅవుట్‌ను తయారు చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



బూరుగుపూడి బాబా ఆలయంలో పారాయణ చేస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలంలో మంగళవారం భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. అలాగే స్వామివారి అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బూరుగుపూడి బాబా ఆలయంలో విష్ణు సహస్ర పారాయణ జరిగింది. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొప్పాక వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



పెదపూడిలో సూర్యనారాయణమూర్తి కల్యాణం

- భక్తిశ్రద్ధలతో సూర్యదేవుని కల్యాణ మహోత్సవం
- జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు

పెదపూడి: మండలంలోని గొల్లల మామిడాడలో ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో వైష్ణవ సంప్రదాయంలో స్వామివారి కల్యాణం జరిపారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు, పాలు, అల్పాహారం, బిస్కెట్లు అందించారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.05 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు. కల్యాణం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చిన్నారుల బుర్రకథ, నృత్యాలతో పాటు తీన్‌మార్ డప్పులు, ఆర్కెస్ట్రా, కేరళ డప్పులు, శక్తి వేషాలు, ఒంటెల ప్రదర్శన, దేవాతమూర్తుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, నియోజకవర్గం పంచాయతీల విభాగం కన్వీనర్ సబ్బెళ్ల మోహన్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు శివకు అభినందనలు



శివకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రకాశం నగర్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ద్వారా గుర్తింపు లభించి, మరింత తర్ఫీదు కోసం క్రికెట్ అకాడమీకి ఎంపికైన చల్లారపు శివను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఆమెను మంగళవారం ఉదయం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శివ మర్యాదపూర్వకంగా కలిశారు. అండర్ 21 కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అకాడమీకి శివను శిక్షణ కోసం ఎంపిక చేసినట్టు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ తరపున శివకు కలెక్టర్ క్రికెట్ కిట్ అందజేశారు. బాస్కెట్ బాల్ కోచ్ ఎస్.మోహన్ దాస్, యోగా కోచ్ బీవీజీ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.